క్లుప్తంగా

19న హెచ్‌పీ గ్యాస్ మేళా

ధవళేశ్వరం: స్థానిక క్వ్యారీ బోర్డు సమీపంలోని మామిడీస్ పెట్రో స్టేషన్ వద్ద ఈనెల 19న హెచ్‌పీ గ్యాస్‌మేళా నిర్వహిస్తున్నట్లు ధవళేశ్వరం గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మామిడి అప్పాజీ తెలిపారు. ఈ మేళాలో కొత్త కనెక్షన్లతో పాటు స్పేర్ సిలిండర్లను అందజేస్తామన్నారు. పాత స్టౌలను ఎక్సేంజ్ ధరలకు ఇచ్చి కొత్తవి తీసుకోవచ్చన్నారు. సురక్ష రబ్బర్ ట్యూబ్‌లు, వంట చేసుకునేటప్పుడు ధరించే యాప్రాన్లు, సిలిండర్ ట్రాలీలను మేళాలో ఉంచడం జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు ఒక కూపన్ ఇస్తామని, అదే రోజు లక్కీ డ్రా తీసి బహుమతులను అందజేస్తామన్నారు. హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆక్రమణలు తొలగించాలి

కడియం: స్థానిక భాస్కర్‌రామ్ నగర్ నుంచి మురుగునీరు బయటకు వెళ్లే పిల్ల కాలువ ఆక్రమణకు గురైందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే కాలనీలో రోడ్లు జలమయమవుతున్నాయన్నారు. పిల్లకాలువ ఆక్రమణలను తొలగిస్తే ఎప్పటికప్పుడు ముంపునీరు బయటకు వెళుతుందన్నారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షం కారణంగా ముంపునకు గురైన శ్యామలా థియేటర్, హైటెక్ బస్టాండ్, ఆల్కాట్ తోట, దేవీచౌక్, కృష్ణా నగర్ ప్రాంతాల్లో గురువారం కమిషనర్ దినేష్‌కుమార్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ కాలువలను పరిశీలించి, సిల్ట్ లేకుండా చూసి, మురుగునీరు సక్రమంగా పారేలా చేయాలని పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలలో కాలువలను పరిశీలించి, అవసరమైన వాటిని వెడల్పు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రకాశరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో సదస్సు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సెప్టెంబర్ 15, 16వ తేదీల్లో రసాయశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ సవాళ్లు అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను గుర్తించి, భవిష్యత్తులో చేయాల్సిన పరిశోధనలు, పర్యావరణ హితంపై చర్చిస్తామన్నారు. సదస్సు కార్యనిర్వాహణాధికారి డాక్టర్ బి.మల్లికార్జున, టి.శ్రీనివాసరావు, జె,యాకోబు, బి.వెంకటరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో రూ.9 లక్షలకు మోసం

రాజమహేంద్రవరం రూరల్: ఆన్‌లైన్‌లో టాస్క్‌ల పేరుతో తనను మోసం చేసి రూ.9 లక్షలకు టోకరా వేశారని మోరంపూడి గణేష్ నగర్‌కు చెందిన పి.ఉషాకిరణ్ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. ఉషాకిరణ్‌కు గత నెల 20వ తేదీన టెలిగ్రామ్ మేసేజ్ వచ్చింది. టాస్క్‌లు చెబితే సొమ్ములు వస్తాయని, ముందుగా కొంత చెల్లించాలని దఫదఫాలుగా రూ.9 లక్షల వరకూ కట్టించుకున్నారు. ఆమె డీమాట్ ఖాతాలో రూ.12 లక్షలు చూపిస్తున్నప్పటికీ అవి తీసుకోవాలంటే మరింత సొమ్ము కట్టాలని చెబుతున్నారు. దీంతో అనుమానం వచ్చి బొమ్మూరు పోలీసులను ఆశ్రయించింది. ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



శ్యామల	జైలర్
సూర్యమినీ	గదర్-2
సూర్యప్యాలెస్	బ్లూబీటిల్
స్వామి	భోళాశంకర్
శివజ్యోతి	ఓఎంజీ-2
అనుశ్రీ	భూతాలబంగ్లా
రాజా	జైలర్
అశోక	జైలర్
ఊర్వశి	పిజ్జా-3
రంభ	బేబీ
మేనక	రఘువరన్ బీటెక్, మిస్టర్ ప్రెగ్నెంట్
అప్సర	బ్లూబీటిల్
నామవరం	
వీఎస్ మహల్	జైలర్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	రఘువరన్ బీటెక్, బ్లూబీటిల్
కడియం	
వెంకటసూర్య	జైలర్

ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు

- ఎంపీ భరత్ రామ్
- ఆవచానల్‌లో పూడిత తీత పనులకు శ్రీకారం



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్, కో ఆర్డినేటర్లు చందన నాగేశ్వర్, గూడూరి శ్రీనివాస్, కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: నగరంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఇందులో భాగంగానే డ్రైనేజీల్లో పూడికను తొలగించే అధునాతన ప్రొవైడెడ్ సొల్యూషన్స్ ఫర్ అర్బన్ డ్రైనేజీ మెషీన్‌ను (డ్రెయిన్ మాస్టర్ మెషీన్) నగరానికి తీసుకువచ్చామన్నారు. హుకుంపేట సెంటర్ వద్ద ఆవ చానల్ (మేజర్ డ్రైనేజీ)లో సుమారు 3.5 కిలో మీటర్ల మేర పూడిక తీసే కార్యక్రమానికి ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ కె.దినేష్ కుమార్, వైఎస్సార్ సీపీ రూరల్, అర్బన్ కో ఆర్డినేటర్లు చందన నాగేశ్వర్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ గురువారం ఉదయం కొబ్బరి కాయలు కొట్టి, పచ్చ జెండా ఊపి పనులు ప్రారంభించారు.

నెలరోజులు పనితీరు పరిశీలన

ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ నగరపాలకసంస్థ తీసుకువచ్చిన మెషీన్ నీటిలోనూ, రోడ్డుపైనా నడుస్తుందని, ఇరుకుగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లి మరీ కాలువల్లోని పూడిక తొలగిస్తుందన్నారు. ఈ రోజు ట్రైల్ రన్‌గా పనులు ప్రారంభించి, ఒక నెల రోజుల పాటు ఈ మెషీన్ పనితీరును పరిశీలిస్తామన్నారు. డ్రైనేజీల్లో పూడికతో పాటు గోదావరిలో వ్యర్థాలు, పూడిక, అనపర్తికి వెళ్లే మార్గంలో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను కూడా తొలగించే సామర్థ్యం ఈ మెషీన్‌కు ఉందన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఈ మెషీన్‌ను ముంబై, ఢిల్లీ నగరాల్లో వినియోగించారని, ఇప్పుడు రాజమహేంద్రవరంలో ఉపయోగిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ శేషగిరి, ఎంహెచ్ఓ వినూత్న, హుకుంపేట సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు కురుమళ్ల ఆంజనేయులు, పార్టీ నాయకులు పసలపూడి శ్రీనివాసరావు, ఎస్‌పీ శ్రీనివాస్, మార్గాని సురేష్, హుకుంపేట పంచాయతీ సెక్రటరీ గుంటూరు వెంకట్రావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య మైదానం అభివృద్ధిపై అపోహలు వద్దు

- చారిత్రక గుర్తులను సంరక్షిస్తాం
- ఎంపీ భరత్ రామ్



సుబ్రహ్మణ్య మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీ భరత్ రామ్, కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం మైదానంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అపోహలు పడవద్దని, చారిత్రక కట్టడానికి, గత వైభవానికి మచ్చ తెచ్చేలా అక్కడ నిర్మాణాలు చేపట్టడం లేదని ఎంపీ మార్గాని భరత్ రామ్ స్పష్టం చేశారు. సుబ్రహ్మణ్యం మైదానంలో చేపట్టిన పనులను కమిషనర్ కె.దినేష్ కుమార్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం మైదానంలో పాత కట్టడాలను తొలగించడం లేదన్నారు. ఇక్కడున్నవి ఒకటి గ్రౌండ్, రెండు స్టేజ్, మూడవది నాలుగు సింహాల స్తంభం.. వీటినేమీ ఎక్కడా ముట్టుకోకుండా అభివృద్ధి చేపట్టామన్నారు. ప్రస్తుతం 20 అడుగుల వెడల్పుతో ఉన్న వేదికను 40 అడుగులు చేయబోతున్నామన్నారు. ప్రేక్షకులకు అనువుగా ఉండేలా సిట్టింగ్ ఎరేంజ్‌మెంట్ చేస్తున్నామన్నారు. మైదానం కాంపౌండ్ వాల్‌కు చిన్న చిన్న ఊసలు ఉన్నాయని వాటి స్థానే విశాలమైన గేట్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఆనం కళా కేంద్రం వెనుక నుంచి ప్రవేశ ద్వారం పెడుతున్నామన్నారు. ఈ పనులన్నీ పూర్తయ్యాక తానే నగర ప్రముఖులను, ప్రతిపక్షాలను తీసుకువచ్చి చూపిస్తానన్నారు. అప్పటికీ నచ్చనట్లయితే తన సొంత డబ్బులతో యథాతథంగా ఉండేలా చేసి అప్పగిస్తానని ప్రకటించారు. సుబ్రహ్మణ్యం మైదానాన్ని ఆనుకుని ఉన్న హోలీ ట్రినిటీ చర్చికి వచ్చే భక్తులకు ఏవిధమైన ఆటంకం లేకుండా ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం చేస్తున్నామన్నారు. చర్చికు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ అనువుగా మైదానం ఏర్పాటు చేస్తామన్నారు. కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ సుబ్రహ్మణ్య మైదానానికి, ఆనం కళా కేంద్రానికి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. కాగా.. హోలీ ట్రినిటీ చర్చి దారికి ఏవిధమైన ఆటంకం లేకుండా ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం జరుగుతుందని ఎంపీ భరత్ రామ్ ఇచ్చిన హామీపై ఆ చర్చి పాస్టర్ దేవభూషణ్ కుమార్, చైర్మన్ గుడాల జాన్సన్, ట్రెజరర్ మేకల జేసు దాసు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, కార్పొరేషన్ ఎస్ఈ పాండురంగారావు పాల్గొన్నారు.

డ్రెయిన్ మాస్టర్ మెషీన్ ప్రత్యేకతలు



హుకుంపేట ఆవకాలువలో పూడిక తీస్తున్న డ్రెయిన్ మాస్టర్ మెషీన్

రాజమహేంద్రవరం రూరల్: ఆవ కాలువ వెంబడి ప్రాంతాలతో పాటు, రాజమహేంద్రవరం నగరంలోని ముంపు సమస్యను పరిష్కరించేందుకు డ్రైనేజీలలో పూడిక తొలగించే అత్యంత అధునాతనమైన ప్రొవైడెడ్ సొల్యూషన్స్ ఫర్ అర్బన్ డ్రైనేజీ డ్రెయిన్ మాస్టర్ మెషీన్‌ను నగర పాలకసంస్థ అధికారులు నగరానికి తీసుకువచ్చారు. ఈ మెషీన్ రోడ్డుపైనా, నీటిలోనూ నడుస్తుంది. ఆవ కాలువలో 3.5 కిలోమీటర్ల మేర లోతుగా సిల్ట్‌ను తొలగిస్తుంది. ఇరువైపులా గట్లు ఉంటే, వాటిపై సిల్ట్‌ను పోస్తుంది. లేకపోతే మెషీన్‌పై ఉన్న బకెట్లలో వేసుకుని, గట్టు వద్దకు తీసుకువచ్చి పారబోయడం జరుగుతుంది. ఈ మెషీన్ ద్వారా నెల రోజుల పాటు ట్రయల్ రన్ నిర్వహిస్తారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ అధికారులు అద్దె ప్రాతిపదికన దీనిని తీసుకువచ్చారు.

వర్షం కురిస్తే ముంపే..

వర్షాకాలం వచ్చిందంటే చాలు గోదావరి ఉధృతితో ఆవ కాలువ వెంబడి ప్రాంతాలు నీటమునగడం పరిపాటి. నగరం నుంచి వచ్చే మురుగునీరు, వర్షం నీరు ఎస్‌టీ ప్లాంట్ నుంచి హుకుంపేట, బొమ్మూరు ఆవకాలువ మీదుగా ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద గోదావరిలో కలుస్తుంది. వర్షాకాలం ముందు నగరపాలకసంస్థ అధికారులు హుకుంపేట ఆవకాలువ పూడికలు తీయిస్తారు. అయితే కాలువకు ఇరువైపులా ఆక్రమణలతో పాటు గృహాలు ఉండడం వలన పూర్తిస్థాయిలో సిల్ట్ తొలగించే అవకాశం లేకుండా పోయింది. దీనివల్ల గోదావరి వరద సమయంలో ఆవకాలువ వెంబడి ప్రాంతాలు నీటమునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విజయవంతంగా నృత్యయజ్ఞం



నృత్యాభినయం చేస్తున్న కళాకారిణులు

సీటీఆర్ఐ: కూచిపూడి నృత్యానికి పూర్వ వైభవం తీసుకురావడానికి రాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు జీబీ నారాయణ సాగిస్తున్న నృత్యయజ్ఞం ఏడో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా గురువారం అన్నవరంలోని సత్యనారాయణస్వామి సన్నిధిలో నృత్య ప్రదర్శన జరిగింది. అనంతరం సాయంత్రం సింహాచలంలోని లక్ష్మీ నృసింహ దేవస్థానంలో నృత్య నీరాజనం చేశారు. ఈ సందర్భంగా జీబీ నారాయణ మాట్లాడుతూ 66 రోజుల పాటు నిర్విరామంగా దేశంలోని అన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో నృత్య నీరాజనం నిర్వహిస్తామన్నారు. రాజమహేంద్రవరంలో ఆగస్టు 11వ తేదీన ప్రారంభించిన ఈ యాత్ర గురువారం సింహాచలం చేరుకుందన్నారు. కూచిపూడికి పూర్వవైభవం తీసుకురావడమే తమ ధ్యేయమన్నారు.కార్యక్రమంలో జి.లక్ష్మీదీపిక, నృత్య బృందం పాల్గొన్నారు.

కన్వీనర్ల సేవలు అభినందనీయం

- పార్టీ విజయానికి కృషి చేయాలి
- ఎంపీ భరత్ రామ్



సమావేశంలో మాట్లాడుతున్న నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, చిత్రంలో ఎంపీలు బోస్, భరత్ రామ్, కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: సచివాలయ కన్వీనర్లు ప్రజలకు నిస్వార్థంగా, సమర్థవంతంగా సేవలందించి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్ల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ భరత్ రామ్, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కన్వీనర్‌కు జీవిత బీమా కట్టించి, వారికీ, వారి కుటుంబాలకు సీఎం జగన్ భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. కన్వీనర్లు కూడా సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందజేయాలన్నారు. రాజమహేంద్రవరం సిటీలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి సచివాలయ కన్వీనర్లకు పలు సూచనలు చేశారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్లు బర్రే కొండబాబు, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, కొత్తా విజయ రాజ్యలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉరివేసుకుని ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: ఉరివేసుకుని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హుకుంపేట డిబ్లాకులో జరిగింది. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. డిబ్లాకుకు చెందిన ఆర్ల రమేష్ (42) భార్య మూడున్నర నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. ఇద్దరు పిల్లలు అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయారు. రమేష్ తల్లి వద్ద ఉంటున్నాడు. ఇటీవల కూలి పనికి వెళ్లకుండా మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో నగరంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. దీని ప్రభావంతో వెంకటేశ్వర నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆల్‌బ్యాంకు కాలనీ, వీఎల్ పురం, సత్యనారాయణపురం, పెద్ద వీధి, శ్రీనగర్ కాలనీ, తిలక్ రోడ్డు, కోనేరుపేట, సాయి బృందావన్ కాలనీ, మోరంపూడి సెంటర్, ఎం మార్బల్ నేషనల్ హైవే ప్రాంతం, మోరంపూడి, గణేష్ నగర్, గాదాలమ్మ నగర్, సాయిబాబా పుంత రోడ్డు, హనుమాన్ నగర్, వెంకట గిరి, మహాలక్ష్మి తోట హోతా లేఅవుట్, ఏవీ అప్పారావు రోడ్డు, బాలాజీ స్ట్రీట్ వెంకటేశ్వర స్వామి టెంపుల్ ఏరియా, కోట సత్తెమ్మ గుడి ప్రాంతం, అద్దేపల్లి కాలనీ, కోదండ రామాలయం ఏరియా, శీలా నగర్, జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డు, కోక భాస్కరమ్మ నగర్, జయశ్రీ గార్డెన్స్, పిల్లివారి స్ట్రీట్, శ్రీనివాస నగర్, శ్రీనివాస గార్డెన్స్, గోపాలనగర్ పుంత, బాబానగర్, వెంకట రామయ్య నగర్, నాగమ్మ తల్లి గుడి వీధి, డీవీబీ రాజు అపార్ట్‌మెంట్ ఏరియా, నారాయణపురం, భాష్యం స్కూల్, గెయిల్ ఆఫీస్ వెనుక ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ ధవళేశ్వరం మెయిన్ రోడ్డు నుంచి సాయిబాబా గుడి వరకు, బోట్ ఆఫీస్, కాటన్ పేట, రథం వీధి, గొల్లపేట ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.
- కడియం: బుర్రిలంక విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మత్తుల కోసం శుక్రవారం ఉదయం 7 నుంచి పది గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ శ్రీధర్ వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో కడియపులంక, బుర్రిలంక, పొట్టిలంక గ్రామాల పరిధిలో సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్
- 49వ డివిజన్‌లో గడప గడపకూ..



మహిళతో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం 49వ డివిజన్‌లో ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నాడు నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా ముఖ్యమంత్రి జగన్ తీర్చిదిద్దారన్నారు. కాగా.. పలు విద్యుత్ సమస్యలను స్థానికులు తెలిపగా, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కానుబోయిన సాగర్, స్థానిక నాయకులు గారా చంటిబాబు ఎస్‌కే ఖాన్ పాల్గొన్నారు.

భారీ వర్షం.. జలమయం



కృష్ణానగర్‌లో రాకపోకలకు ప్రజల అవస్థలు




హుకుంపేట సావిత్రీనగర్‌లో జలమయమైన రోడ్డు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో గురువారం కురిసిన కుండపోత వానకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. ఆర్యాపురం, దేవీచౌక్ సెంటర్, రామచంద్రరావు పేట, కృష్ణా నగర్, తుమ్మలావ, హైటెక్ బస్టాండ్ సెంటర్, శ్యామలా సెంటర్, కోరుకొండ రోడ్డు, పేపరుమిల్లు రోడ్డు, జేఎన్ రోడ్డు, స్టేడియం రోడ్డు తదితర ప్రాంతాల్లో మురుగుకాలువలు పొంగిపొర్లాయి. రామచంద్రరావు పేట, కృష్ణానగర్, తుమ్మలావ ఏరియాలో కొన్ని ఇళ్లలో నీరు చేరింది. శ్యామల సెంటర్, హైటెక్ బస్టాండ్, తుమ్మలావలో రోడ్లపై మూడు అడుగుల మేర నీరు వచ్చింది.

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బొమ్మూరులోని బాలాజీపేటరోడ్డు, హుకుంపేట సావిత్రీ నగర్, ఎఫ్‌సీఐ కాలనీ ప్రాంతాలుమునిగాయి. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మదర్ థెరిస్సా విగ్రహావిష్కరణ



తొర్రేడు హైస్కూల్లో మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉప్పులూరి సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మదర్ థెరిస్సా విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని రికార్డు అసిస్టెంట్ పట్నాల వెంకటేశ్వరరావు బహూకరించారు. అలాగే పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి కపిలేశ్వరపురం మండలం మాచరం జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెచ్ఎంగా వెళ్లిన రమాదేవిని, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి రూరల్ ఎంఈవో-2గా వెళ్లిన చందుకుమార్‌ను, ఉపాధ్యాయుడిగా పనిచేసి సీతానగరం మండలం వెదుళ్లపల్లికి బదిలీపై శతపతి శ్రీనివాస్‌ను గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చిట్టూరి వెంకటరావు, దండమూడి అర్జునరావు, మల్లిన సూర్యప్రకాశరావు, మండల విద్యాశాఖాధికారి -1 తులసీదాస్, రాజానగరం ఎంఈవో-2 జ్యోతిప్రసాద్, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు మేకా సాయిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి



సెంట్రల్ జోన్ డీఎస్పీ కిషోర్‌ను సత్కరిస్తున్న శ్యామ్‌రాజ్ నాయక్

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్‌రాజ్ నాయక్ అన్నారు. ర్యాగింగ్ నిరోధక వార్షికోత్సవంలో భాగంగా స్థానిక ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ కళాశాల విద్యార్థులకు గురువారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్యామ్‌రాజ్ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ కళాశాలలో ఆరు రోజులుగా ర్యాగింగ్ నిరోధకతపై విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ కిషోర్ మాట్లాడుతూ ర్యాగింగ్ చేసిన విద్యార్థులు చట్టపరమైన సమస్యలు ఎదుర్కొంటారన్నారు. సంధాన కర్తగా వ్యవహరించిన డాక్టర్ విజయ శంకర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు పలు అంశాలను వివరించారు.